మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట


# భూ భారతి రెవెన్యూ సదస్సులపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 9 ప్రభాతవార్త:** జూన్ 2 నుండి అన్ని మండలాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని, తహశీల్దార్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ మే 5 నుండి పైలెట్ ప్రాజెక్టుగా గోపాల్‌పేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, జూన్ 2 నుండి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల రెవెన్యూ సదస్సు నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఎంపిక చేసుకోవడం, రెవెన్యూ సదస్సుకు తీసుకువెళ్లాల్సిన రికార్డులు అన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ధరణిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే ఆర్డీఓ లాగిన్‌కు పంపించాలని, ఆర్డీఓ లాగిన్ నుండి కలెక్టర్ లాగిన్‌కు పంపించాల్సిందిగా ఆదేశించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించే నాటికి ధరణి లాగిన్‌లో పెండింగ్ ఉంచుకోవద్దని సూచించారు. భూ భారతి చట్టంలో ఉన్న నిబంధనలు, ధరణిలో పరిష్కారం కానీ సమస్యలు భూ భారతి ద్వారా ఎలా పరిష్కరించవచ్చు, అందుకు గల భూ భారతిలో చట్టంలో ఉన్న నిబంధనల పై తహశీల్దార్లకు ఒక్కో అంశం వారిగా అవగాహన కల్పించారు. అదేవిధంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయిన గోపాల్‌పేట రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు, పరిష్కారానికి ఉన్న అవకాశాలు, ఎదురైన సమస్యల పై తహసిల్దార్ పాండు ద్వారా తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయండి

**మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి**



ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్,మే 9 ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ పట్టణ సమీపంలో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ విస్తరిస్తున్న మక్తల్ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో 150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు ఇక్కడే అందుబాటులో ఉంటాయని ఆయన అన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాజీ ఎంపిటిసి కోళ్ల వెంకటేష్,మాజీ ఉపసర్పంచ్ కట్టా సురేష్,నాయకులు కావలి తాయప్ప, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, వాకిటి శ్యామ్, వర్కూరు అంజనేయులు, శాలం, రంజిత్ రెడ్డి, సుకన్య శేఖర్, నరసింహమూర్తి, హోటల్ కొండయ్య, హస్ముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి

**-40 వాహనాలు సీజ్**



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

**వెల్దండ,మే 9 ప్రభాతవార్త:** రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని కొట్ర చౌరస్తాలో శుక్రవారం రోడ్డు భద్రతలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్ ఆదేశాల మేరకు కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వెల్దండ సిఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెల్దండ ఎస్ఐ కురుమూర్తి, కల్వకుర్తి,చారకొండ,వంగూరు,ఊర్కొండ పోలీస్‌స్టేషన్‌ల ఎస్ఐలు వారి సిబ్బందితో కలిసి దాదాపు 50మంది పోలీస్ సిబ్బందితో సాయంత్రం చౌరస్తాలో వాహన తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీలలో తాగి వాహనం నడిపిన 2, లైసెన్సు లేని 8, ఇన్సూరెన్స్ లేని 17 నెంబర్ ప్లేట్లు లేని 13వాహనాలను మొత్తం 40 వాహనాలను (బైక్ లు 27, కార్లు 11, ఇతర వాహనాలు 2) సీజ్ చేశారు. ఇట్టి వాహనాలపై కేసులు నమోదు చేసి వాహన యజమానులను, డ్రైవర్లను కల్వకుర్తి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ విష్ణువర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ కల్వకుర్తి సబ్ డివిజన్‌లోని అన్ని గ్రామాల వాహనదారులకి ఎవరైనా సరైన పత్రాలు లేకుండా, నడిపిన మద్యం సేవించి, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, మైనర్ లకు వాహనాలు ఇచ్చిన అట్టి వాహనాలు సీజ్ చేస్తామన్నారు.అదేవిధంగా వాహన యజమానుల పైన కేసులు నమోదు చేస్తామని ప్రజలందరూ తప్పకుండా రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించి మీ యొక్క విలువైన ప్రాణాలను అదేవిధంగా ఎదుటివారి ప్రాణాలను కాపాడాలన్నారు.

## మొబైల్ హెల్త్ టీం ద్వారా ఆరోగ్య సమస్యలకు పరిష్కారం

**నారాయణపేట టౌన్, మే 9 ప్రభాతవార్త :** మొబైల్ హెల్త్ టీం ద్వారా ఆరోగ్య సమస్యలు పరిష్కరించడానికి వీలు కలుగుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అధ్యక్షతన అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, డా. జయచంద్ర మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమక్షంలో ఆర్.బి ఎస్.కే.కార్యక్రమాన్ని అభివృద్ధి చేయుటకై విద్యా వైద్య శాఖల మధ్య సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌బిఎస్‌కే మొబైల్ హెల్త్ టీం ద్వారా స్క్రీనింగ్, ట్రీట్మెంట్, రిఫరల్ విషయాలపై మెరుగుపరిచేందుకు తగిన సూచనలు ఇవ్వడం జరిగినది. ప్రతి విద్యార్థికి యొక్క వ్యక్తిగత ఆరోగ్య సమాచారం కొరకు ప్రత్యేక మెడికల్ ఐడి ఉండాలని సూచించడం జరిగినది.వైద్యశాఖ మరియు విద్యాశాఖ రెండు సమన్వయంగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని మరింత మెరుగుపరచాలని సూచించడం జరిగింది. విద్యార్థుల యొక్క ఆరోగ్య సమాచారము మరింత స్పష్టంగా ఉండేలా వెబ్ పోర్టల్‌లో తగిన మార్పులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్ డా. శైలజ, ఎస్ఓ సాగర్, డా. మోనేష్ సూపర్‌వైజర్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

# ఇకపై పక్కాగా భూ రికార్డులు..

### నిజాలాపూర్, మహమ్మద్ హుస్సేన్ పల్లిలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి

**మూసాపేట, మే 9 ప్రభాతవార్త :** భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా మూసా పేట్ మండలం నిజాలాపూర్, మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయంల ఆవరణలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ విజయేందిర పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు. ఒకే దరఖాస్తులో రైతులు రెండు, మూడు రకాల భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితవు పలికారు. దరఖాస్తుల పరిశీలన ఆన్లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన మూసాపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పుగా ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావంలో మార్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్‌బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద మూసా పేట్ మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన మీదట, జిల్లాలోని మిగితా మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో తహశీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వింటున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## ఉన్నత చదువులతోనే ఉత్తమ గుర్తింపు : వనపర్తి ఎమ్మెల్యే

**పెబ్బేర్, మే 9 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు పొంది స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులను పెబ్బేర్ అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన చదువులతోనే విద్యార్థులకు ఉత్తమ గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఉంటూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాలంటూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెబ్బేరు మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు సంబంధించి పదవ తరగతి పరీక్షలలో ఉన్నతమైన మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన శాలువాలతో సన్మానించారు. పెబ్బేరు మండలంలోని ఎంజెపి ఉన్నత పాఠశాలకు చెందిన అనూషను, పెబ్బేర్ మోడల్ స్కూల్ చెందిన ఝాన్సీ రాణిని, కంచిరావుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన రామచందర్‌ను, రంగాపురం ఉన్నత పాఠశాలకు చెందిన రజియా బేగంను, సూగురు ఉన్నత పాఠశాలకు చెందిన శ్రావణిని,పెబ్బేరు కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయానికి చెందిన ఐశ్వర్యను, పెబ్బేరు ఉన్నత పాఠశాలకు చెందిన నవ్యను,అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన హసీమ బేగంను, యాపర్ల ఉన్నత పాఠశాలకు చెందిన శివానిని, పెబ్బేరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన స్వప్నను, గుమ్మడం ఉన్నత పాఠశాలకు చెందిన నరేష్ ను,వైశాఖ పురం ఉన్నత పాఠశాలకు చెందిన మేనకను,ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఉన్నతమైన భవిష్యత్తు మార్గాలను ఎంచుకొని పట్టుదలతో సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి,వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపీపీ కురుమూర్తి, నాయకులు సత్యం, వెంకట రాములు, దయాకర్ రెడ్డి రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, యుగేందర్ రెడ్డి, గంధం రాజశేఖర్, యాపర్ల రాంరెడ్డి, వేణు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

## ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలను పూర్తి చేయాలి

**గద్వాల ప్రతినిధి,మే9,ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల పనుల లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐ.డి.ఓ.సి. కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ యువ వికాసం పథకం, ధ్యానం కొనుగోలు కేంద్రాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతిని మండలాల వారీగా సమీక్షిస్తూ, మంజూరైన ఇండ్ల నిర్మాణ పనుల్లో గ్రౌండింగ్, బేస్‌మెంట్,మార్క్ అవుట్, రీ వెరిఫికేషన్ తదితర అంశాలను అధికారుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి అయ్యేవిధంగా లబ్ధిదారులను ప్రోత్స హించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణ విధానాన్ని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరా లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం వెంటనే అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి దశల వారీగా లబ్ధిదారులకు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమ చేయడం జరుగుతుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిఅయ్యేలా చూడాలని తెలిపారు. మున్సిపాలిటీలలో అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి,అర్హులకు ఇండ్లని గ్రామాలపై సూచనలు అందించాలని,పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.నిరుపేద అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అధికారులను ఆదేశించారు.రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతంచేయాలని జిల్లాకలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. అర్హుల ఎంపిక సమయంలో –మిగతా3లో..



అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

## రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**కలెక్టరేట్లో రెడ్ క్రాస్, తలసేమియా దినోత్సవం**



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 9 ప్రభాతవార్త :** అత్యవసర పరిస్థితుల్లో, బాధపడే వారికి సహాయం అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయం అని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ స్వచ్ఛంద సేవకులు, తలసేమియా బాధితుల సమావేశానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తలసేమియాకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. నోబుల్ అవార్డు గ్రహీత జాన్ హెన్రీ డ్యూనాంట్ గొప్ప ఆశయంతో స్థాపించిన రెడ్ క్రాస్ ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థంగా సేవలు అందిస్తూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. యుద్ధ భూమిలో గాయపడిన క్షతగాత్రులకు, ప్రకృతి వైపరీత్యాల్లో , కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇబ్బందుల్లో ఉన్న వారికి వైద్య, ఆరోగ్య సేవలను అందించడంలో రెడ్ క్రాస్ చురుకైన పాత్ర పోషించడం గర్వించ దగిన విషయమన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలను అభినందించారు. అదే విధంగా రెడ్‌క్రాస్ సేవలను మరింతగా విస్తృతం చేయాలని సూచించారు. తలసేమియా బాధితులకు స్థానిక వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, వైస్ ఛైర్మన్ డా. శామ్యూల్, కోశాధికారి జగపతి రావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు లయన్ జి.. రమణయ్య, జిల్లా సభ్యులు డా. శశికాంత్, తిరుపతి రెడ్డి, యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్తలు బాబుల్ రెడ్డి, అశ్విని చంద్రశేఖర్, మేనేజర్ ఏ.నరసింహా, సిబ్బంది పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిష్కరించాలి

**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



భూ భారతి రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 9 ప్రభాతవార్త:** భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం గోపాలపేట మండలంలోని ఎదుట్ల గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించారు. భూ సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను సూచించారు. రెవెన్యూ సదస్సులో సహాయక కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, భూ సమస్యలు ఉన్నవారు తగిన ఆధారాలు తీసుకువస్తే సహాయక కేంద్రంలో నమూనా ప్రొఫార్మాలో దరఖాస్తు పూరించి ఇస్తారని చెప్పారు. ప్రజలు తమ భూ సమస్యల పట్ల ఆందోళన పడాల్సిన అవసరం లేదని, భూ భారతి ద్వారా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేయాలని, సక్సెషన్ కు సంబంధించి వెంటనే నోటీసులు జారీ చెయ్యాలని సూచించారు. ఏదుట్ల గ్రామంలో ఈ రోజు 28 దరఖాస్తులు వచ్చాయి. పైలెట్ ప్రాజెక్టుగా గోపాలపేట మండలాన్ని ఎంపిక చేసుకుని రెవెన్యూ మే, 5వ తేది నుండి మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా నేటి వరకు 322 దరఖాస్తులు రావడం జరిగింది. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, గోపాల్పేట తహాసిల్దార్ పాండు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారం

### భూ సమస్యల పరిష్కారం కోసం 14 దరఖాస్తులు : ఆర్డీవో శ్రీనివాసరావు

**ఇటిక్యాల, మే 9 ప్రభాతవార్త :** కొన్నేళ్లుగా రైతులు బూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న కారణంగా తమ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మీసేవ కేంద్రాలలో చెల్లించే డబ్బులు కూడా మిగిలిపోయి ఉచితంగా సమస్యలు పరిష్కరించుకునేందుకు మంచి అవకాశం కలదని ఆర్డీఓ శ్రీనివాస రావు రైతులకు వివరించారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని మొగలిరావల్ చెరువు గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవిన్యూ సదస్సు తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించగా ఆర్డీఓ శ్రీనివాసరావు పాల్గొని ప్రజల భూ సమస్యలను తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ధరణి చట్టం వల్ల రైతులు సమస్యల వల్ల ఇబ్బందులు పడ్డారని వాటిని తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి 2025 ఆర్వోఆర్"చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఇటిక్యాల మండలం ఎంపిక చేశామని ఇందులో పరిష్కారం చేసినట్లయితే జిల్లాలోని మిగతా మండలాలకు పూర్తిస్థాయిలో అవగాహన కలుగుతుందన్నారు. రైతులు గతంలో అధికారులను కలవాల్సి వచ్చేదని రెవెన్యూ సదస్సుల వల్ల అధికారులు గ్రామాల్లోకి వచ్చి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. గ్రామాలలో భూమి వివాదాల పరిష్కారానికి ఈ నెలాఖరులోగా అర్హులైన వారికి ఉత్తర్వులు జారీ చేస్తామని రైతులకు వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. వాటిని ఆన్ లైన్ లో నమోదు చేస్తామని సదస్సు లో భూ రికార్డుల సవరణలు,విస్తీర్ణ మార్పులు,వారసత్వ సమస్యలు, భూమి స్వభావానికి సంబంధించిన లోపాలు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు,సాదా బైనామాలు, సర్వే నంబర్ గల్లంతు, పాస్‌బుక్ జారీ కాకపోవడం వంటి అంశాలు పరిష్కరించబడతాయని తెలిపారు. పై సమస్యలకు పరిష్కారం కొరకు గతంలో మీ సేవలో డబ్బులు చెల్లించే వారిని రెవిన్యూ సదస్సు వల్ల ఉచితంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 5వ రోజు మొగలిరావల్ చెరువు గ్రామంలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం 14 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఇటిక్యాల తహసిల్దార్ వీరభద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల తహసీల్దార్ వీరభద్రప్ప, ఎర్రవల్లి తహసిల్దార్,నరేష్, సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, నరేష్, ఆర్ఐలు మదన్ మోహన్, గురు రాజా, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.



రైతుల నుండి భూ సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసరావు

## కాంగ్రెస్ మండల అధ్యక్ష బరిలో క్యామ మల్లయ్య



**వంగూరు, మే 9 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బడా నాయకులు కాంగ్రెస్ పార్టీలో తమ కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గెలుపునకు కృషి చేస్తూ వంగూరు మండలంలోనే కాకుండా అచ్చంపేట నియోజకవర్గంలో తనకున్న పరిచయాలతో పాటు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి ఎమ్మెల్యే గెలుపుకు కొంత వరకు కృషి చేసిన వారిలో ఒకరు వంగూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన క్యామ మల్లయ్య. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బరిలో క్యామ మల్లయ్య ఉన్నట్లు తెలుస్తోంది. గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గెలుపు కోసం అహర్నిశలు క్యామ మల్లయ్య కృషి చేశారు. అదే కాకుండా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ యువతను సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా ఎమ్మెల్యేకు అండగా ఉంటూ వస్తున్నారు. ప్రస్తుతం మల్లయ్య అచ్చంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధినేత బీసీ వర్గాలకు చెందిన యువతకు రాజకీయాలలో అధిక ప్రాధాన్యత కల్పిస్తామనడం గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో క్యామ మల్లయ్య బీసీ కోటాలో మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న క్యామ మల్లయ్యకు మండల బాధ్యతలు అప్పగిస్తే పార్టీ మరింత బలోపేతమవుతుందని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. మండలంలో పార్టీని సమన్వయం చేసే నాయకుడు లేకపోవడంతో ఎవరికి వారు యమునా తీరు అన్నట్లుగా వ్యవహరిస్తూ ఒక్కో గ్రామంలో 2 లేదా 3 గ్రూపులుగా ఏర్పడి పార్టీని చిన్న భిన్నం చేస్తున్న పరిస్థితి నెలకొంటుందని చెప్పుకోవచ్చు. యువతకు అవకాశాలు ఇస్తే అన్ని వర్గాల ప్రజలను మమేకం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే అవకాశం లేకపోలేదని బాహటంగా చర్చలు కొనసాగుతున్నాయి.

## ఆర్టిఐ ఫోరమ్ మండలం అధ్యక్షుడిగా అశోక్



**శ్రీరంగాపూర్, మే 9 ప్రభాతవార్త :** సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్స్ ఫోరం శ్రీరంగాపురం మండల అధ్యక్షులుగా కంబాలాపూర్ గ్రామానికి చెందిన మేకల అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు వనపర్తి జిల్లా అధ్యక్షులు జి.రవికుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వ యం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని ఆర్టిఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సంగం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది. సమాచార హక్కు చట్టం విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత జవాబుదారీతనం సాధ్యమన్నారు. తనపై ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులుకి, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు .

## బిజెపి మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

**మక్తల్, మే 9 ప్రభాతవార్త:** బిజెపి ఊట్కూరు మండల నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ గౌడ్‌ను శుక్రవారం బిజెపి నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మక్తల్ పట్టణంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, మాజీ ఎంపిటిసి జి.బలరాం రెడ్డి ఆధ్వర్యంలో చంద్రశేఖర్‌గౌడ్‌ను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని వారు ఆకాంక్షించారు. ఊట్కూరు ఎంపీపీ, జడ్పిటిసి స్థానంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపిటిసిలు, సర్పంచ్ స్థానాల్లో బిజెపి అభ్యర్థులు గెలుపొందేలా కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని వారు అన్నారు. సామాన్య కార్యకర్తకు సైతం మండల అధ్యక్ష పదవి దక్కడం ఒక్క బిజెపితోనే సాధ్యమని వారు అన్నారు. కార్యక్రమంలో నాయకులు జయానంద్ రెడ్డి, రమేష్, నల్లె నరసప్ప, తిమ్మప్ప, ఆంజప్ప, బస్వరాజ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

## ఈత చెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మిడ్జిల్, మే 9 ప్రభాతవార్త :** తాటి ఈత చెట్లను కూల్చివేసి తమ ఉపాధిని దెబ్బ తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని మిడ్జిల్ మండల పరిధిలోని వెల్గోముల గ్రామానికి చెందిన కోదండంగౌడు రాజేందర్లు జడ్చర్ల ఎక్సైజ్ సిఐ విప్లవ రెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈత చెట్లను కూల్చివేసి తమ ఉపాధిని దెబ్బతీసిన కూపిరెడ్డి నరసింహారెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు సిఐ విప్లవరెడ్డిని కోరారు. గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రి ఎస్కలేటర్ సహాయంతో సుమారు 10 ఈత చెట్లను అకారణంగా తొలగించారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈత చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఇదే అదునుగా భావించి ఇంకొకరు కూడా తాటి ఈత చెట్లను పీకేసే అవకాశాలు ఉంటాయని వారు తెలిపారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం కఠిన చర్యలు తీసుకొని గౌడ కులస్తులకు న్యాయం చేయాలని వారు సిఐని కోరారు ఈ కార్యక్రమంలో వెలుగొమ్మల గౌడ సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

**గద్వాల, మే 9,ప్రభాతవార్త:** వచ్చేనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత పేర్కొన్నారు. శుక్రవారం గద్వాల కోర్టు ఆవరణలో జాతీయ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో న్యాయమూర్తి సమావేశమయ్యారు. ఠాణాలు, కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరగకుండా ఇరువర్గాలను సమన్వయపరచి క్రిమినల్ కేసుల రాజి విషయమై వారిలో అవగాహన కలిగించాల న్నారు. రాజీమార్గమే రాజమార్గమని రక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు సమయం వృధా కాకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ వి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎన్.వి.హెచ్ పూజిత, ఏ.పి.పి సంజన,డీఎస్పీ మొగులయ్య,సి.ఐలు, స్టేషన్ ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి

## ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

**భూత్పూర్,మే 9,ప్రభాతవార్త :** రాత్రి వేళలో జాతీయ రహదారి-44పై ఇనుపలోడ్‌తో ట్రాక్టర్ ట్రాలీని తోలుతూ,రహదారి మధ్యలో ఉండే రేలింగ్‌ను ఢీకొట్టి కింద ఇదే ట్రాక్టర్ మీదుగా వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన గురువారం రాత్రి భూత్పూర్ మండల పరిధిలోని అన్నాసాగర్‌కు సమీపంలోలోని మలుపు వద్ద జాతీయ రహదారి-44పై జరిగింది.భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరుకు చెందిన యనమల రామసంజీవరెడ్డి(35) రెండు నెలల క్రితం జిల్లాకు వచ్చి తన సొంత ట్రాక్టర్ ట్రాలీతో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు.ఇదే క్రమంలో గురువారం ఇనుప రాడ్‌ల లోడ్‌తో జిల్లా కేంద్రంలోని పీయూ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సైనిక్ భవన నిర్మాణం కోసం అవసరమయ్యే ఇనుప రాడ్ లోడ్‌తో మహబూబ్‌నగర్ వస్తుండగా రాత్రి పదిగంటల సమయంలో హైవేపై వస్తున్న క్రమంలో హైవేపై ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్స్ వల్ల ముందు రహదారి సరిగ్గా కనపడకపోవడంతో రహదారి మధ్యలో అమర్చిన రేలింగ్‌ను ఢీకొట్టగా రామసంజీవరెడ్డి ట్రాక్టర్ ట్రాలీపై నుంచి కింద పడిపోయాడు.వేగంగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ యనమత రామసంజీవరెడ్డిపై నుంచి వెళ్లగా రామసంజీవరెడ్డి ట్రాక్టర్ ట్రాలీ కింద నలిగి అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు.మృతుని బాబాయ్ కాంట్రాక్టర్,రిటైర్డ్ ఉద్యోగి యనమల లక్ష్మినారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.ట్రాక్టర్,మోటార్‌సైకిలిస్టులు రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై ప్రయాణాలను సాధ్యమైనంతవరకు తగ్గించుకోవాలని,తద్వారా ప్రమాదాలను కొంతవరకు నివారించుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ వాహనదారులకు సూచించారు.

### ప్రైవేటు పాఠశాలల కన్నా

# ప్రభుత్వ పాఠశాలలే మిన్న

**ఉప్పునుంతల, మే 9 ప్రభాతవార్త :** ప్రైవేటు పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తారని, బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో శుక్రవారం ఉదయం తిరుమల గుడి సమీపంలో ప్రాథమిక బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాసులు అధ్యక్షతన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముందస్తుగా ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఉపాధ్యాయులు, నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులతో పాటు ఉచిత నిర్బంధ విద్య, ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. బట్టీ విధానంలో కాకుండా బోధనోపకరణాలతో కృత్యాధార పద్ధతిలో అర్థవంతమైన బోధన అందిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తమ పాఠశాల నుంచి గురుకుల పాఠశాలల ప్రవేశాల కోసం ప్రత్యేక తరగతులు, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ విద్య, డిజిటల్ తరగతుల వంటి వినూత్న పద్ధతుల్లో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛ, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో చదువులు అందిస్తున్నామని ఉపాధ్యాయులు వివరించారు. ఈ సంవత్సరం ఎనిమిది మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించాలని, తమ పాఠశాల నుంచి గత ఏడు సంవత్సరాలుగా 49 మంది విద్యార్థులకు గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన సంగతి వారు గుర్తు చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోటు పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు వివరించారు. పాఠశాలల్లో విశాల తరగతి గదిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. మన గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను స్వీకరించాలని సూచించారు. విషయ నిపుణులైన ఉపాధ్యాయులు, సుదీర్ఘంగా అనుభవం కలిగిన ఉపాధ్యాయ బృందం అంకితభావంతో పనిచేస్తుందని పలువురు ప్రసంగించారు. తమ పిల్లలను ఉన్నత శిఖరాలకు అధిరోహించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి గురుకుల సీట్లు సాధించే విధంగా కృషి చేస్తున్నారని, బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్ తన కుమారుని ఇదే పాఠశాలలో చదివించడం ఆదర్శనీయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి పేర్కొన్నారు. అందుకని మన గ్రామంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తమరి పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నో ఖర్చులు పెట్టి సుదూర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాల కన్నా మన గ్రామంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సమావేశంలో ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం. శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్,చందన, సంగిత, బాలు ఎలక్ట్రానిక్స్ మొబైల్ షాప్ ప్రొఫెసర్ బొల్లె బాలయ్య, పాతుకుల రామచంద్రయ్య, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మడ్డి తిరుపతయ్య గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ ఆలూరి శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాతుకుల కురుమయ్య, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో గోడ పత్రిక విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

## కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు ధరఖాస్తు చేసుకోండి

**గద్వాల, మే 9,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అందించే పురస్కారాలకు చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు.పోచంపల్లి ఇక్కత్, డ్రెస్, జనరల్ వెరైటీస్, నారాయణపేట, గద్వాల చీరల నేత పని రకాల్లో నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ పురస్కారాలకు అర్హులని చెప్పారు. వీవింగ్ కేటగిరీలో 2024 డిసెంబర్ 31 నాటికి 30 సంవత్సరాల వయస్సు నిండి, వృత్తిలో పదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఇందులో విజేతలైన చేనేత కళాకారులకు రూ. 25,000/ ల నగదు పురస్కారము మరియు ప్రశంశా పత్రము మరియు మెమెంటోతో పాటుగా శాలువాతో సత్కారం మొదలగునవి బహుకరించబడుతాయని తెలిపారు.డిజైనింగ్ కేటగిరీలో 25 సంవత్సరాల వయస్సు నిండి, వృత్తిలో ఐదేళ్ల కనీసం అనుభవం ఉండాలన్నారు.దరఖాస్తు చేసుకునే కళాకారులు తాము తయారు చేసిన పూర్తి వస్త్రమును శాంపిల్ గా గద్వాలలోని ఐడి ఓసి లో ఉన్న తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు.నమూనాగా పంపే వస్త్రము అమ్మకం చేయరాదని,తయారు చేసిన వస్త్రము లేదా డిజైన్ తానే స్వయంగా రూపొందించినట్లుగా స్వీయ ధృవీకరణ పత్రము సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలు తమ కార్యాలయంలో లభిస్తాయని, మే 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నియమించబడ్డ అవార్డు ఎంపిక కమిటీకి ప్రతిపాదనలుగా పంపించడం జరుగుతుందన్నారు. పురస్కారాలకు ఎంపికైన నమూనాలు అవార్డు ప్రధానం చేసిన తర్వాత సంబంధిత చేనేత కళాకారులకు పోస్టు ద్వారా తిరిగి పంపించనున్నట్లు వివరించారు.

## ప్రతి రైతు ఫార్మా రిజిస్టర్ చేసుకోవాలి : మండల వ్యవసాయ అధికారి

**ఉప్పునుంతల, మే 9ప్రభాతవార్త :** భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మా రిజిస్టర్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాబోయే కాలంలో రైతులకు అందించే సబ్సిడీ, రసాయనిక ఎరువులు రైతు ఎంత తీసుకోవాలో భూమిని పట్టి రసాయనిక ఎరువులు ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు. రైతు యొక్క భూమి వివరాలను బట్టి ఇవ్వడానికి నిర్దేశించడం కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు భూ ఆధార్‌ను 11 అంకెలతో ఒక ప్రత్యేకమైన గుర్తింపు కార్డును అంద జేస్తుందని వివరించారు. మండలంలోని ప్రతి ఒక్క రైతు ఈ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియను స్థానిక వ్యవసాయ శాఖ వారు ఎలాంటి చార్జి లేకుండా నిర్వహించడం జరుగుతుందని, ఒకవేళ వ్యవసాయ కార్యాలయానికి రైతు రాని పక్షంలో వారికి అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రాలకు వెళ్లి రైతు ఫార్మా రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఈ ప్రక్రియకు కావలసిన పత్రాలు ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్‌ను ఎంట్రీ చేయాల్సి వస్తుందని తెలిపారు. మీసేవ కేంద్రాలలో కేవలం రూ.50 మాత్రమే చెల్లించాలని, అదనంగా వసూలు చేసిన మీసేవ కేంద్రాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని ఎఓ రైతులకు సూచించారు. మీసేవ కేంద్రాల వద్ద రైతులు ఫార్మా రిజిస్టర్ చేసుకోవడానికి వచ్చిన ప్రతి రైతు వద్ద కేవలం రూ.50 మాత్రమే తీసుకోవాలని, అదనంగా వసూలు చేస్తే ఉన్నత అధికారులకు వివరించాల్సి వస్తుందని ఏవో హెచ్చరించారు.



మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్

## విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకే శిక్షణా తరగతులు

### గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి

**ఉప్పునుంతల, మే 9 ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు వివిధ కళలో రాణించేందుకే వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత సామర్థ్యాలను, సృజనాత్మకత నైపుణ్యాలను గుర్తించి వాటికి పదును పెట్టడమే లక్ష్యంగా తొలిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వేసవికాలం శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందులో భాగంగా మండల కేంద్రమైన ఉప్పునుంతల అంబేద్కర్ చౌరస్తా ఏరియాలో పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పిటిఎం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశానుసారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం గ్రామ ప్రముఖులు, విద్యావేత్తలు, గ్రామ ప్రజలు, ఎఎపిసి, ఎస్‌హెచ్‌జి సభ్యులతో ప్రతి గ్రామ కూడలిలో పిటిఎం సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, పోకల సతీష్, శ్యాంసుందర్ గౌడ్, శ్రీనివాసులు, కల్పన, మల్లారెడ్డి, పద్మావతి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల అధ్వర్యంలో పిటిఎం సమావేశం

## ఉగ్రవాద నిర్మూలనకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలి

**మక్తల్, మే 9 ప్రభాతవార్త :** ఉగ్రవాద నిర్మూలనకు దేశంలోని ప్రతి ఒక్క పౌరుడు భారత త్రివిధ దళాలకు మద్దతుగా నిలిచి దేశభద్రత కై పాటుపడాలని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, మాజీ ఎంపిటిసి జి. బలరాం రెడ్డి అన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలతో పాటు మన దేశంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పాక్ ఆర్మీ పై భీకరమైన దాడులను జరిపి, ఉగ్రవాదాన్ని అంతం చేసే దిశగా భారత త్రివిధ దళాలు ప్రపంచానికి మన దేశ సత్తా చాటిందని అన్నారు. శుక్రవారం మక్తల్ పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత 20 రోజుల క్రితం జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మరణించిన 28 మంది అమరుల ఆత్మలకు నిజమైన శాంతి కలిగేలా భారత త్రివిధ దళాలు పాక్ పై దాడులను జరిపి అనుకున్న లక్ష్యాన్ని సాధించారని వారు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని ప్రజలు సుఖశాంతులతో జీవనం గడుపుతుంటే, పాక్ ఉగ్రవాద ముఠాలు దాడులకు పాల్పడి కల్లోలం రేపడం జరిగిందన్నారు. దీనికి ప్రతిగా పాక్ పై భారత్ యుద్ధం ప్రారంభించిందని వారు అన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా రూపుమాపే వరకు భారత త్రివిధ దళాలు నిరంతరాయంగా యుద్ధం చేయాలని, వారికి ప్రతి భారతీయుడు సంపూర్ణ మద్దతును తెలియజేయాలని వారు అన్నారు. దేశంలో ఉంటూ దేశద్రోహానికి పాల్పడే ప్రతి ఒక్కరికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వారన్నారు. పార్టీలు, సంస్థలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దేశ భద్రతకై తమ వంతు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయానంద్ రెడ్డి, రమేష్, నల్లె నరసప్ప, తిమ్మప్ప, అంజప్ప, బస్వరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**మక్తల్,మే9 ప్రభాతవార్త:** వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని మక్తల్ ప్రాంత క్రీడాకారులకు మెరుగైన శిక్షణను అందించేందుకు గాను మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటి బి.గోపాలం అన్నారు.సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న దాదాపు 60 మంది క్రీడాకారులతో పాటు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన రాయికోడ్ గ్రామానికి చెందిన టి.అనూషను శుక్రవారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. దాదాపు నెల రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో ఖో ఖో, వాలీబాల్, సైక్లింగ్, టెన్నికాయిట్ క్రీడలలో మెరుగైన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. శిక్షణలో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ ఉచితంగా క్రీడా దుస్తులతో పాటు మెమొంటోలను అందించడం జరిగిందన్నారు. మక్తల్ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో ఇప్పటికే అనేకమంది పాల్గొని తమ సత్తా చాటడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులోనూ మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో ప్రతిభను కనబరిచి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు రమేష్ కుమార్, రాఘవేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.




క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్, బిజెపి నాయకులు

శ్రీరంగాపూర్, మే 9 ప్రభాతవార్త : శ్రీరంగాపూర్ మండల్ కంబాలపురం గ్రామంలో బిజెపి సీనియర్ నాయకుడు అయిన రాములు యాదవ్ కుమారుడి వివాహ వేడుకల్లో కాంగ్రెస్ బిజెపి నాయకులు పాల్గొని వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు అశోక్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్రెడ్డి, అనుజ్ఞ రెడ్డి , మాజీ జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ నాయుడు, రాజేష్, మోహన్ రాజు, నరేష్, శివయ్య, ఎల్లస్వామి, బ్రహ్మయ్య చారి, తిరుపతయ్య నాయుడు, నిజాం తదితరులు పాల్గొన్నారు.

## ఈజీఎస్ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు



ఈజీఎస్ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ఉప్పునుంతల,మే9 ప్రభాతవార్త:** మండలకేంద్రమైన ఉప్పునుంతలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కిం ద పనిచేస్తున్న ఈ జీఎస్ కూలీలకు శుక్రవారం ఓఆర్ఎస్ ప్యా కెట్లు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ, వాంతులు,విరేచనాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్యకు అందజేశారు. దీంతో పనులు నడుస్తున్న ప్రాంతంలోనే కూలీలకు అందజేశారు. ఉదయం వేళల్లో పనులు నిర్వహించాలని, మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వడదెబ్బ కొట్టే ప్రమాదం ఉందని వైద్యులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

## బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందజేసిన ఎమ్మెల్యే



చెక్కును బాధితురాలికి అందిస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల, మే 9,ప్రభాతవార్త:** శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని చాగదోన గ్రామానికి చెందిన మునిస్వామి విద్యుత్ షాక్‌తో మరణించారు.ఆయన భార్య సరోజకు ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయంను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి విద్యుత్ ప్రమాదబీమా 5లక్షలరూపాయల చెక్కును అందజేశారు.ఆపద స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి , నాయకులు ఉరుకుందు, చంద్రశేఖర్ , తిమ్మప్ప నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ యుద్ధంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తి అవ్వాలి



ప్రత్యేక పూజలు చేస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ

**మల్దకల్ మే 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కమీషనర్ ఆదేశముల ప్రకారం ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న ధర్మ యుద్ధంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తి అవ్వాలని భారతదేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానము,మల్దకల్ గ్రామం జోగులాంబ గద్వాలజిల్లా యందు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. ప్రతి ఒక్కరం ఇప్పుడు ఒక సైనికుల్లా పని చేయాలని ఏకతాటిపై నిలుచుని దేశానికి అండగా ఉండాలని పిలుపు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు పట్వారి ప్రహ్లాద రావు కార్యనిర్వహణ అధికారి ఎం సత్య చంద్రారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చంద్రశేఖరరావు మద్దెల బండ నారాయణ ఈరన్న,రాముడు ఉప్పరి నారాయణ కొంకతి నరేందర్ నాయకి మధు అశోక్, శీను తదితరులు పాల్గొన్నారు .

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ వినతి

**ఆత్మకూర్ ప్రభాతవార్త మే 9 ప్రభాతవార్త:** ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినటువంటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ చెక్రి శశిధర్ కు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అంతేకాకుండా ఈపీఎఫ్ పెన్షన్ ద్వారా ప్రతి కార్మికుడికి 9,000 చెల్లించాలని అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని దేశవాపితంగా నిర్వహించినటువంటి సార్వత్రిక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసి జయప్రదం చేసేందుకు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని లేనిపక్షంలో కార్మిక సంఘాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రసాద్ వెంకటేష్ వెంకటమ్మ జిలాని కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

